# గణనాథుడికి ప్రత్యేక పూజలు



బజార్‌హత్నూర్: గణేశ్ నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్

బజార్‌హత్నూర్, అక్టోబర్ 1 : ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్‌లో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా యువ చైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుడిని ఆదివారం బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్ దర్శించుకున్నారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడుతున్న యువ చైతన్య యువజన సంఘం సభ్యులను ఆయన అభినందించారు. ముందుగా మాజీ సర్పంచ్ సాయన్న చేతుల మీదుగా యూత్ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ రాజారాం, నాయకులు ప్రేమ్‌దాస్, వినోద్, చైతన్య, లక్ష్మణ్, గ్రామస్తులు, యువజన సంఘం సభ్యులు రాజేశ్వర్, లక్ష్మణ్, సాయి, నరేశ్, కార్తీక్, ప్రశాంత్ పాల్గొన్నారు.

## నిమజ్జన శోభాయాత్రలో పాల్గొన్న జాదవ్ అనిల్

నేరడిగొండ, అక్టోబర్ 1 : మండలంలోని తేజాపూర్, నేరడిగొండ, కుమారి, వడూర్, వాంకిడి గ్రామాల్లో గణేశ్ నిమజ్జన శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. ఈ శోభాయాత్రలో బోథ్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్ పాల్గొని యువకులతో కలిసి నృత్యాలు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ అల్లూరి శివారెడ్డి, ఉపసర్పంచ్ దేవేందర్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నానక్‌సింగ్, ఎస్‌ఐ సాయన్న, యువకులు పాల్గొన్నారు.



నేరడిగొండ: గణేశ్ నిమజ్జన శోభాయాత్రలో పాల్గొన్న బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్

# నీతి ఆయోగ్‌కు పెంబి మండలం ఎంపిక

- అభివృద్ధిపై సర్పంచ్‌లు, అధికారులకు శిక్షణ
- ప్రణాళికలు రూపొందిస్తున్న అధికారులు



ప్రధాని అధ్యక్షతన నిర్వహించిన భారత సంకల్ప్ కార్యక్రమానికి హాజరైన సర్పంచ్‌లు, అధికారులు

పెంబి, అక్టోబర్ 1 : నిర్మల్ జిల్లా పెంబి మండలం నీతి ఆయోగ్ (నేషనల్ ఇన్‌స్టిట్యూషన్ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా)కు ఎంపిక కావడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నీతి ఆయోగ్ సూచన మేరకు మండలంలో 11 శాఖలు, 39 అంశాలపై ప్రణాళికలు రూపొందించి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించనున్నారు. దీని కోసం ఉన్నత అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ రూరల్ డెవలప్‌మెంట్‌లో రెండు రోజుల పాటు బ్లాక్‌స్థాయి అధికారులు, ఢిల్లీలో నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన నిర్వహించిన భారత మండపం ప్రాంగణంలో సంకల్ప్ సప్తా కార్యక్రమానికి జడ్పీ సీఈవో సుధీర్‌బాబు, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, పెంబి సర్పంచ్ పూర్ణచందర్ గౌడ్, మందపల్లి సర్పంచ్ సుధాకర్, ఇటిక్యాల సర్పంచ్ మహేందర్, కోశగుట్ట సర్పంచ్ రాజులు వెళ్లి శిక్షణ పొందారు. నీతి ఆయోగ్ ద్వారా మంజూరైన నిధులతో పాటు మండలంలోని వనరులను సద్వినియోగం చేస్తూ పెంబి మండలాన్ని అభివృద్ధి చేయడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఆరోగ్యం, పోషణ, విద్య, వ్యవసాయం, రహదారులు, తాగునీరు, విద్యుదీకరణతో పాటు పలు సదుపాయాలను ప్రజలకు అందించడమే లక్ష్యంగా నీతి ఆయోగ్ కార్యక్రమాలు చేపడుతున్నది. దీంతో అన్ని శాఖల అధికారులు ప్రణాళికలు రూపొందిస్తుండడంతో పెంబి పురోగతి సాధించనున్నది. మండల కేంద్రంలో ప్రతి గ్రామ పంచాయతీలో చింతన్ శివర్ కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. త్వరలో కలెక్టర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ప్రజా ప్రతినిధులు, అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు ప్రణాళికలు రూపొందించనున్నారు. పెంబి మండలంను నీతి ఆయోగ్ ఎంపిక చేయడంతో రాబోయే రెండు సంవత్సరాల్లో మండలం అన్ని శాఖల్లో అభివృద్ధి చెందనుందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.




చింతన్‌శివిర్‌లో అభివృద్ధికి కృషి చేస్తామని ప్రమాణం చేస్తున్న అధికారులు

### నీతి ఆయోగ్ ఎంపికతో పెంబి అభివృద్ధి



నీతి ఆయోగ్‌కు పెంబి మండలాన్ని ఎంపిక చేయడంతో మరింత అభివృద్ధి చెందనున్నది. నీతి ఆయోగ్ సూచనల మేరకు అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసి అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిసున్నాం. హైదరాబాద్, ఢిల్లీలో నీతి అయోగ్ కార్యక్రమాల్లో పాల్గొన్నాం. రాబోయే రెండు సంవత్సరాల్లో మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి కృషి చేస్తాం. మండలంలోని ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించి పెంబి అభివృద్ధికి కృషి చేయాలి

**-సుధాకర్ రెడ్డి, ఎంపీడీవో, పెంబి**

### నీతి అయోగ్‌కు పెంబిని ఎంపిక చేయడం అదృష్టం



పెంబి మండలాన్ని నీతి అయోగ్‌కు ఎంపిక చేయడం అదృష్టంగా భావిస్తున్నాం. గ్రామంలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలో, ప్రజలు ఆర్థికంగా ఎదిగేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలన్నా అంశాలపై అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. రెండు రోజుల క్రితం నీతి అయోగ్ ఆధ్వర్యంలో ఢిల్లీలో ప్రధానమంత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన సంకల్ప్ సప్తా కార్యక్రమానికి పెంబి మండలం నుంచి పలువురు సర్పంచ్‌లు వెళ్లి శిక్షణ పొందినాం. నీతి ఆయోగ్ ద్వారా గ్రామాభివృద్ధికి కృషి చేస్తాం.

**-అర్గుల పూర్ణచందర్ గౌడ్, సర్పంచ్, పెంబి**

# పరిసరాల శుభ్రత అందరి బాధ్యత




ఎదులాపురం: రిమ్స్‌లో పరిసరాలు శుభ్రం చేస్తున్న డైరెక్టర్, డీఎంహెచ్‌వో, డీఎంవో

ఎదులాపురం, అక్టోబర్ 1 : పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని ఎల్‌డీఎం ప్రసాద్ అన్నారు. ఆదిలాబాద్‌లో లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌డీఎం మాట్లాడుతూ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ స్వచ్ఛత పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ఆర్‌ఎం శ్రీనివాస్, టీజీబీ ఆర్‌ఎం రమణారెడ్డి, ఏజీఎం రాహుల్, మేనేజర్లు శ్రీధర్, ఇండాల్, సిబ్బంది పాల్గొన్నారు.

**అంగన్‌వాడీ కేంద్రంలో ..**

జిల్లా కేంద్రంలోని సుందరయ్యనగర్ అంగన్‌వాడీ కేంద్రం-1లో పరిసరాలు పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రాధ, ఏఎల్‌ఎంఎస్ సభ్యులు రబ్బాని, రషీదా, ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు.

**రిమ్స్ ఆధ్వర్యంలో..**

స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా రిమ్స్ ఆవరణలో డైరెక్టర్ రాథోడ్ జైసింగ్, డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్, డీఎంవో మెట్‌పెల్లి శ్రీధర్, సిబ్బందితో కలిసి పరిసరాల్లో పిచ్చి మొక్కలు తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారంలో రెండు రోజుల పాటు డ్రైడేను నిర్వహించాలని సూచించారు. నిల్వ నీటితో దోమలు వ్యాపించి డెంగీ వచ్చే అవకాశం ఉందన్నారు. ఇందు కోసం ప్రతి ఒక్కరూ పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు.



ఇచ్చోడ : అవగాహన కల్పిస్తున్న అధికారులు

**సఖీ కేంద్రం ఆధ్వర్యంలో..**

స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఓల్డ్ హౌసింగ్ బోర్డు కాలనీలోని సఖీ కేంద్రం ఆవరణలో పరిసరాలు శుభ్రం చేశారు. అనంతరం భవన నిర్మాణ కార్మిక సంఘం భవనంలో సఖీ కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది లావణ్య, నాగమణి పాల్గొన్నారు.

**పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి**

ఇచ్చోడ, అక్టోబర్ 1 : పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో రాంప్రసాద్ అన్నారు. ఆదివారం స్వచ్ఛతా హీ సేవా-2023 చెత్త రహిత భారతదేశం శ్రమదానం (ఏక్ తారీఖ్.. ఏక్ ఘంటా.. ఏక్ సాథ్)లో భాగంగా ఇచ్చోడలో ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఐకేపీ మహిళలు ర్యాలీ తీసి స్వచ్ఛ ప్రతిజ్ఞ చేసి, శ్రమదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రీతమ్‌రెడ్డి, సర్పంచ్ సునీత, ఉపసర్పంచ్ శిరీష్ రెడ్డి, ఎంపీవో రమేశ్, ప్రధానోపాధ్యాయుడు రాజేంద్రప్రసాద్, ఏపీవో నరేందర్, పంచాయతీ కార్యదర్శి సూర్య ప్రకాశ్ పాల్గొన్నారు.



ఎదులాపురం: చెత్తాచెదారం తొలగిస్తున్న బ్యాంకు అధికారులు